https://teluguislam.net



بسم الله الرحمن الرحيم

# తొలి పలుకులు

అల్లాహ్‌కు మాత్రమే సర్వ ప్రశంసలు, సర్వ పొగడ్తలు శోభనీయం. ఆయన అపార కరుణామయుడు పరమకృపాశీలుడు, దయామయుడు, అపారంగా క్షమించేవాడు. తన దాసులందరిని అమితంగా ప్రేమించేవాడు. అల్లాహ్ కారుణ్యం ప్రతి ఒక్కరిని ఆవరించి ఉంది. మార్గభ్రష్టులను రుజు మార్గాన్ని ప్రసాదించేవాడు, పాపాత్ములను క్షమించేవాడు ఆ మహా ప్రభువు ఒక్కడే. ఆయనే నిజమైన ఆరాధ్యుడు, ఆయన తప్ప మరో ఆరాధ్యుడు లేడు. మరియు ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) అల్లాహ్‌కు ప్రియమైన దాసుడు, ఆయన పంపగ వచ్చిన చిట్టచివరి ప్రవక్త. ఆయనపై మరియు ప్రవక్తలందరిపై, వారి అనుచరులపై, వారి కటుంబీకులపై మరియు పుణ్యాత్ములైన సత్య మూర్తులపై దైవ కారుణ్యం మరియు శాంతి వర్షించుగాక!.

**అమ్మాబాదు!...**

అల్లాహ్ పట్ల ప్రేమాభిమానాలు కలిగిఉన్న దాసులకు ఇహపర లోకాలలో ఆయన లెక్కలేనంత అనుగ్రహాలు ప్రసాదిస్తాడు. కనుక అల్లాహ్ ఇహలోకంలో మానవులకు ఇస్లాం ధర్మాన్ని అనుగ్రహించి, సన్మార్గాన్ని ప్రసాదించాడు. మరియు మిధ్యా దైవాల దాస్యం నుండి విముక్తినిచ్చి ఒకేఒక్క నిజమైన, పరిశుద్ధమైన, మహోన్నతమైన ఏకేశ్వరోపాసన

https://teluguislam.net



మహా భాగ్యాన్ని ప్రజలకు కల్పించాడు. మూఢ విశ్వాసాల, మూఢ నమ్మకాల చీకట్ల నుండి వెలికితీసి, జ్ఞానవంతమైన, ప్రకాశవంతమైన, సత్యవంతమైన విశ్వాసాన్ని, నమ్మకాన్ని ప్రసాదించాడు.

మానవ మార్పిడికి అతీతమైన దివ్య గ్రంథం ఖుర్‌ఆన్‌ను అల్లాహ్ ప్రసాదించి, మానవ మార్పిడికి గురైన గ్రంథాలను ఆయన తొలగించాడు. ప్రళయం వరకూ తిరుగులేని ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) మార్గాన్ని ప్రసాదించి, అసత్య అన్య మార్గాలను తొలగించాడు. సులభమైన, సమంజసమైన ఆరాధన విధానాలను విధించి, కఠోరమైన, కఠినమైన ఆరాధన విధానాలను తొలగించాడు. కొద్దిపాటి ఆరాధనకు కొండంత పుణ్యాలను ప్రసాదించాడు. కొండంత పాపాలను ఒక్క క్షమాభిక్షతో మన్నించి తన ప్రియమైన దాసులను పునీతులుగా చేశాడు. ఓ అల్లాహ్! గొప్ప క్షమాశీలివి నీవే.

**ఓ అల్లాహ్!** నీవు సుగుణవంతులను ప్రేమిస్తావు, గొప్పగా సన్మానిస్తావు. మానవులు పరస్పరం ప్రేమాభిమానాలతో మసులుకుంటే, నీవు వారిని ప్రేమిస్తావు. తల్లిదండ్రుల సేవ చేసేవారిని నీవు కనికరిస్తావు. ఆడపిల్లలను పెంచి పోషిస్తే స్వర్గాన్ని ప్రసాదిస్తావు. అక్కాచెల్లెళ్ళను, అన్నదమ్ములను ఆదుకునేవారిని అనుగ్రహిస్తావు. రక్తసంబంధీకులను మరియు అతిదగ్గరి బంధువులను ప్రేమిస్తే, ఉపాధిలో వృద్ధిని ప్రసాదిస్తావు. పేదలను అగత్యపరులను, దరిద్రులను, ఇరుగుపొరుగువారిని సహాయ సహకారాలు అందజేసేవారి సహాయంలో నీవు ఉంటావు. పీడితులను, రోగులను పరామర్శిస్తే పుణ్యాలను ప్రసాదిస్తావు, పాపాలను క్షమిస్తావు.

https://teluguislam.net



**ఓ అల్లాహ్!** నీవు అగత్యపరుల, అబలల పక్షానివి. నీవే గొప్ప సహాయకుడివి. ప్రేమామయుడివి.

**ఓ అల్లాహ్!** నిన్ను విశ్వసించి నీ మార్గంపై నడుచుకున్న దాసులను ప్రత్యేకంగా కరుణిస్తావు. మరణానంతరం వారిని తన సింహాసనం నీడలో ఆశ్రయమిస్తావు. ప్రత్యేకమైన **కౌసర్** (దివ్య జలం, సరోవరం) నీటిని త్రాపిస్తావు. అది త్రాగినవారికి దాహం అంటూ ఉండదు. ప్రళయదినాన భయంకరమైన కారుచీకటిలో తన ప్రియమైన దాసులకు జ్యోతిని ప్రసాదిస్తావు.

అలా తన ప్రియమైన దాసులను స్వర్గాన్ని ప్రసాదించి సన్మానిస్తావు. స్వర్గవాసులు ఆ రోజు స్వర్గంలో తమ ప్రేమామయుడైన అల్లాహ్‌ను ప్రత్యక్షంగా చూసుకుంటారు. తరువాత అల్లాహ్ స్వర్గవాసులతో: **''నేను మీకు నా ప్రసన్నత మహాభాగ్యాన్ని ప్రసాదించాను, ఇక మీదట ఎన్నడూ మీ పట్ల కోపగించుకోనూ!''** అని అంటాడు.

**ఓ అల్లాహ్!** నీవే ప్రేమామయుడివి, గొప్ప కనికరం కలిగినవాడివి. నీవు తప్ప మరో సత్యమైన ఆరాధ్యుడు లేడు, నీవే సర్వలోకాలకు ప్రభువు.

**''అల్లాహ్‌ను ప్రేమించండి స్వర్గాన్ని చేరుకోండి''** అనే పేరుతో ఈ పుస్తకాన్ని దివ్య ఖుర్‌ఆన్ మరియు హదీసు గ్రంథాల, తెలుగు అనువాదాల వెలుగులో మరియు అనేక అరబీ గ్రంథాల నుండి ప్రామాణికమైన హదీసులను సేకరించి వాటిని తెలుగులో అనువాదం చేసి, చక్కని క్రమబద్ధంగా కూర్పు చేసాను. దీని ద్వారా ప్రతి మానవుడు విశ్వాసపరంగా, విధేయత పరంగా, ఆరాధన పరంగా అల్లాహ్ ప్రేమకు

https://teluguislam.net



కారణమయ్యే విధి విధానాలను, ఆచారాలను, గుణాలను తెలుసుకొని, ఆచరించి అల్లాహ్ చిత్తంతో స్వర్గానికి చేరుకోగలడు.

**జమ్ఇయతుూ ఎహ్యాఉత్తురాస్ అల్ ఇస్లామీ– మర్కజుల్ హిదాయా లిత్తౌయియతిల్ జాలియాత్** (ఇస్లాం పరిచయ సమితి కువైట్) సంస్థ ఖుర్ఆన్ మరియు సహీహ్ హదీసుల వెలుగులో ఇస్లాం పరిచయ కార్యక్రమాన్ని చేపట్టింది. తెలుగు భాషలో కూడా ఈ సంస్థ ద్వారా అనేక పుస్తకాలు మరియు కరపత్రాలు ప్రచురించబడ్డాయి. వారి సేవలను అల్లాహ్ స్వీకరించుగాక.

జఫరుల్లాహ్ బషీర్ ఖాన్ నద్వీ

2/2/1433 / హిజ్రీ శకం

28/12/2011